భక్త జన సందోహం

చిత్తారమ్మకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు



చిత్తారమ్మ దేవి

షాపూర్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తులు.. తెల్లవారు జాము 3 గంటల నుంచే మొక్కులు, ఇసుకేస్తే రాలనంతగా జనం. వెల్లు విరిసిన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, శివసత్తులు, పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఇవి చిత్తారమ్మ జాతరలో ఆదివారం కనిపించిన దృశ్యాలు..

గాజులరామారం గ్రామ ప్రజలకు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం చిత్తారమ్మదేవి. ఆదివారం చిత్తారమ్మదేవి జాతర కనులపండువగా జరిగింది. జాతరకు జంట నగరాల నుంచే కాక తెలంగాణ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకొన్నారు. తెల్లవారు జామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి మొక్కులు తీసుర్చుకొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జాతర తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించారు. జాతరలో గంగిరెద్దుల ఆటపాటలు, శివసత్తుల పునకాలు, తలను బోనం ఎత్తుకొని ప్రదక్షిణలు చేసిన మహిళా భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

ప్రత్యేక పూజలు..

అమ్మవారి ప్రధాన జాతరలో ఉదయం 3 గంటలకు అభిషేకం, 4 గంటలకు విజయదర్శనం, తలంబ్రాలు (ఒడిబియ్యం) పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు బోనాలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఊరేగింపు ప్రారంభం అయింది. గాజులరామారం గ్రామం నుంచి ప్రారంభమయిన ఊరేగింపులో దారిపొడవునా పోతరాజు విన్యాసాలు, తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి వినోద, సాంస్కృతికి కార్యక్రమాలు భక్తుల కోసం ప్రదర్శించారు. జాతరకు ప్రముఖులు, రాజకీయ నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ట్రాఫిక్ మళ్లింపు..

ఆదివారం అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ముందస్తుగా గాజుల రామారం ప్రధాన రహదారిలో వచ్చే వాహనాలను పోలీసులు దారిమళ్లించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టారు. తాగునీరు, వైద్యం, మూత్రశాలలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. జాతరలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి రాచకొండ బాల్‌రాజ్, డైరెక్టర్లు జి.నర్సింహ, డి. కృష్ణారెడ్డి, ఎం.వెంటారెడ్డి, ఆర్. నర్సింహ, భిక్షపతి, సలహాదారులు కూన శ్రీనివాస్‌గౌడ్, పి. శంకర్‌రెడ్డి, డి.ఇంద్రసేనారెడ్డి, ఏ.ఇంద్రసేనాగుప్తా, భక్తులు పాల్గొన్నారు.



జాతరలో శివసత్తులు పూనకాలు





హాజరయిన భక్తులు



క్యూ లైన్‌లో వేచివున్న భక్తులు



బోనంతో మహిళా భక్తులు



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకుడు, పరామర్శిస్తున్న బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి

రక్తదాన శిబిరానికి స్పందన

అల్లాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీ నగర్ డివిజన్‌లోని చిత్తారమ్మ దేవాలయం వద్ద బీజేపీ యువ మోర్చా నాయకుడు సాయికుమార్ సోదరుడు సుధీర్ 25వ జయంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి శిబిరం నిర్వాహకులకు, రక్తదానం చేసిన వారిని అభినందించారు. సోదరుడి జ్ఞాపకార్థం చేసే సామాజిక పనుల్లో రక్తదానాన్ని మించిన సమాజ సేవ లేదన్నారు. కార్యక్రమంలో మూసాపేట్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాగిరెడ్డి

ఫతేనగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎడ్ల మోహన్‌రెడ్డి, బుచ్చిబాబు, సంతోష్ తదితరులు హరివర్ధన్‌రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో ఏ బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి



వెంకటేశ్వరరావుకు ప్రమాణపత్రం అందజేస్తున్న ఎన్నికల నిర్వాహకులు

బబ్బుగూడ కాలనీ సంక్షేమ సంఘం
అధ్యక్షుడిగా వెంకటేశ్వర రావు

అల్లాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ పరిధిలోని బబ్బుగూడ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్(రి.నెం.177 బై 1970)కు ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో బి.వెంకటేశ్వర రావు, మాజిద్ ఖాన్, సయద్ సలీం పోటీపడ్డారు. 254 మంది సభ్యులున్న సంఘానికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో వెంకటేశ్వర రావు తన సమీప ప్రత్యర్థి మాజిద్ ఖాన్ మీద 60 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఎన్నికల్లో గెలిచిన వెంకటేశ్వర రావుకు ఎన్నికల నిర్వాహకులు ప్రమాణ పత్రం అందజేశారు.



విద్యార్థినిల కూచిపూడి నృత్యప్రదర్శన

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

రాయదుర్గం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన నృత్యప్రదర్శనలు సందర్శకుల మదిని దోచుకున్నాయి. భారతీయ కళా క్షేత్రం విద్యార్థినిలు పలు అంశాలపై చక్కటి హావభావాలతో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కాంగ్రెస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కెఎం ప్రతాప్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని కుత్బుల్లాపూర్ గ్రామంలో శివాత్మక క్లినిక్ లేబోరెటరీ అండ్ ఫార్మసి వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వాతావరణ మార్పులతో వస్తున్న వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే బస్తీలో చేపడుతున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, మహేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కేఎం ప్రతాప్‌గౌడ్

ఎల్ఈడీ స్క్రీన్‌పై విగ్రహ ప్రతిష్ఠ ప్రసారం

గాజులరామారం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ మందిర ప్రారంభోత్సవ సందర్భంగా గాజులరామారం డివిజన్‌లోని పలు బస్తీలు, కాలనీల సభ్యులు దేవేందర్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో రామ భక్తులు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రసారాన్ని వీక్షించనున్నారు.

కార్మికుల శ్రేయస్సుకు ఐఎన్‌టీయూసీ పోరాటం

జీడిమెట్ల, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సు కోసం ఐఎన్‌టీయూసీ పోరాడుతుందని రాష్ట్ర కార్మిక నాయకుడు చింతల నాగరాజు అన్నారు. ఆదివారం జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మోకేబుల్ కంపెనీ ఆవరణలో ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్మికులకు మంచివేతన ఒప్పందం చేసి కార్మికుల హక్కులను నిలబెడతామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దేవా, ఆనంద్, కార్మికులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న చింతల నాగరాజు

కల్యాణ్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్
అధ్యక్షుడిగా వసంతరావు



వసంతరావు

బాలానగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ కల్యాణ్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిసాయి. అధ్యక్ష పదవి కోసం కలకుంట్ల స్వాతి, వంగల వసంతరావు బరిలో నిలిచారు. వీరిలో వసంతరావు 48 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి స్వాతి మీద విజయం సాధించారు. వసంతరావుకు మద్దత్తుగా 94 మంది ఓటు వేయగా స్వాతి 46 ఓట్లకే పరిమితం కావాలసి వచ్చింది. అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను స్థానిక బస్తీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మిగతా కమిటీ సభ్యుల నియామకం కోసం కసరత్తు జరుగుతోంది. ఎంటీఆర్ పరిశ్రమలో 23 ఏండ్లు ఆపరేటర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆయన ప్రస్తుతం గౌతమీనగర్‌లో వర్క్‌షాపును నిర్వహిస్తున్నాడు.

మల్లు రవిని కలిసిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

ఓల్డుబోయినపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవిని కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ సీనియర్ నాయకులతో కలిసి మల్లు రవి నివాసానికి వెళ్లి ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



మల్లు రవిని కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న హరివర్ధన్‌రెడ్డి

షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నేతలు

అల్లాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ టీసీసీఎస్‌డీ ప్రధాన కార్యదర్శి వాజిద్ పాషా ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మోతీనగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి షబ్బీర్ అలీను కలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ శాఖలకు ప్రభుత్వ సలహాదారుడిగా నియమించబడినందుకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మతీన్ షరీఫ్, అంజద్, గౌస్ పాల్గొన్నారు.



షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాజిద్ పాషా, మతీన్ షరీఫ్, తదితరులు

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బాలానగర్/ఓల్డుబోయినపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరామాలయంలో జరుగనున్న బలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని బాలానగర్ రాజు కాలనీ వైకుంఠ రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ గన్ను తిరుపతయ్య గుప్తా తెలిపారు. ప్రధాని మోదీ భక్తులకు సూచించిన విధంగా సోమవారం రాత్రి ప్రతి ఇంట్లో 5 దీపాలు (రెండు గడప ముందు, 2 దేవుడి పటాల ముందు, ఒకటి తులసి కోటలో) వెలిగించి భక్తిని చాటాలని ఆయన హిందువులందరికి సూచించారు.

ఓల్డుబోయినపల్లిలో...

ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ వ్యవస్థాపకులు బోయిని గోపాల్ ముదిరాజ్ తెలిపారు.

అల్లాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌లో శివరామాంజనేయుల ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు మోతీనగర్ కూడలి నుంచి శ్రీరామ శోభాయాత్ర తలపెట్టారు. శృంగేరి శారద శంకర మఠం ఆధ్వర్యంలో శ్రీ రామ భజన నిర్వహిస్తున్నారు.

గచ్చిబౌలి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో సోమవారం జరగనున్న బలరాముని విగ్రహ ప్రతిష్ఠకు శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ అయోధ్యకు తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన 100 మంది వీఐపీలు ఆహ్వానం పంపింది.

భెల్‌కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిర ప్రారంభం సందర్భంగా రామాలయాలు, వైష్ణవాలయాలు సర్వాంగసుందరంగా సుందరంగా ముస్తాబయ్యాయి. బెల్ టౌన్‌షిప్‌లో శ్రీ వేంకటేశ్వర, యోగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం జరుగనున్న శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పా ట్లను పూర్తి చేశారు.

బెల్ ఎంఐజీ కాలనీలోని రామాలయంలో జరిగే విశేష పూజలు సీతారామ కల్యాణం సందర్భంగా రామాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు.

రాయదుర్గం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు గచ్చిబౌలి టెలికాం నగర్‌లో భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.



అయోధ్యకు తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, బైక్ ర్యాలీలో ఆరెస్సెస్ కార్యకర్తలు



రాములవారి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారానికి టీఎన్‌జీఓ కాలనీలో ఏర్పాట్లు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

హైదర్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్ ఫేస్-2 గాంధీనగర్ కాలనీలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లతో సమస్యగా ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి స్తంభాలు, వైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలోను పీజేఆర్‌నగర్, గాంధీనగర్ కాలనీలకు అవసరమైన విద్యుత్ స్తంభాలను మంజూరు చేసి కాలనీలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలను సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రామస్వామి, షకీల్‌మున్నా, సలీమ్, భిక్షపతి, పోశెట్టిగౌడ్, సాయిగౌడ్, మహిళా గౌరవ అధ్యక్షురాలు మధులత, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



స్థానికుల చెబుతున్న సమస్యలు నోట్ చేసుకుంటున్న జగదీశ్వర్‌గౌడ్

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

- శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ ఓంకార్ నగర్ బస్తీలో ఆదివారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు 20 సంవత్సరాలుగా బస్తీలో నివాసం ఉంటున్నా మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. వారు చెప్పిన సమస్యలను ఆయన నోట్ చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తునమన్నారు. బస్తీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ఆరాధ్య, ఆస్మాకు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలోఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో మియాపూర్‌కు చెందిన టి.ఆరాధ్య ఆస్మా షరీఫ్ షాహిద్ పసిడి పతకాలు సాధించారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో 12 ఏళ్ల ఆరాధ్య కటాలో బాలికల జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. సీనియర్ కేటగిరీలో ఆస్మా షరీఫ్ అగ్రస్థానంలో నిలిచి, పతకం నెగ్గింది.



పతకాలతో ఆరాధ్య, ఆస్మా

శాంతి స్థాపనకు పద్మశాలీలు కృషి చేయాలి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

భెల్‌కాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి స్థాపన కోసం పద్మశాలీలు కృషి చేస్తూ.. పద్మశాలీల విశిష్టతను తెలియచేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. బెల్ టౌన్‌షిప్‌లోని అధికార కార్మిక సంఘ కార్యాలయ ఆవరణలో పద్మశాలీ సంక్షేమ సంఘాన్ని స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, సంక్షేమ పథకాల్లో వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పద్మశాలీ సంఘ వ్యవస్థాపకులు, పద్మశాలీ సంఘ ప్రముఖులను, అతిథులను సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, వివాహ పరిచయ వేదిక జరిగాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగేందర్ యాదవ్, నగేష్ యాదవ్, సింధూ ఆదర్శ్‌రెడ్డి మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు అశోక్, సోందాస్, రాఘవరావు, ఆదర్శ్‌రెడ్డి, మ్యాకం మల్లేష్, సంఘం అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

నేడు రమ్యగ్రౌండ్ కూడలిలో అన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని రమ్యగ్రౌండ్ నాలుగు రోడ్ల కూడలిలో అన్నదానం చేయనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్న సమారాధన ఉంటుందని వెంకట సాయి బైక్స్ ప్రవీణ్, శ్రీబాలాజీ ప్లాస్టిక్స్ రాము ఓ ప్రకటనలో తెలిపారు.

